ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
15 మే
2025



# పీజీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల్లో యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్ సాధించిన జాగృతి విద్యార్థిని




భువనగిరి: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రకటించిన పీజీ( ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ) ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలలో 9.91 జిపిఏ మార్కులతో నారా భాను శ్రీ యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్ సాధించి మరొక మారు జాగృతి సత్తా చాటారు. ఈ ఫలితాలలో సంద్ర జయంతి 9.73, గడ్డం శివప్రసాద్ 9.55, చిలుకూరి భావన9.45, మట్ట అనూష 9.45, నిమ్మని మానస 9.45 వంటి అత్యుత్తమ GPA మార్కులు సాధించారు. వీరితోపాటు తొమ్మిది మంది విద్యార్థులు 9 కంటే ఎక్కువ GPA లు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థుల ఉద్దేశించి ప్రిన్సిపల్ డాక్టర్ బి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించడం జాగృతి కళాశాలకు ఒక మంచి సాంప్రదాయంగా మారిందని తెలియజేశారు. డిగ్రీలోనే కాకుండా పీజీలో కూడా విద్యార్థులను యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ప్రతిభవంతులుగా తయారు చేయడంలో జాగృతి అధ్యాపకుల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె బాలకృష్ణారెడ్డి గారు కళాశాల కరెస్పాండెంట్ ఎస్ మల్లేశం , డైరెక్టర్ డా. కె. నాగేందర్ , వైస్ ప్రిన్సిపల్ మణిపాల్ రెడ్డి , అకాడమిక్ మిక్ కోఆర్డినేటర్ నవీన్, పీజీ హెచ్ ఓ డి బి. ఎల్మా రెడ్డి, పీజీ ఇంచార్జ్ బి సుధా మరియు ఇతర అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు గోల్డ్ మెడల్ మరియు మోమెంటో శాలువాలతో ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియ జేశారు.

# భక్తిభావంతో సన్మార్గంలో పయనించడానికి మార్గమేర్పడుతుంది

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: దేవుని పట్ల భక్తిభావం పెంచుకుంటే చెడు అలవాట్లు దూరమై సన్మార్గంలో పయనించడానికి మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో రామాలయంలో బుధవారం నిర్వహించిన 'జీవధ్వజస్తంభ' ప్రతిష్ఠాపన, నవగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే అనుకున్నది సాధించవచ్చని తెలిపారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా చేసే పనుల పట్ల ఏకాగ్రత పెరిగి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. ఇటీవల కాలంలో యువత చెడు వ్యసనాలకు అలవాటై జీవితాన్ని నాశనం చేసుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ముఖ్యంగా యువత ఆధ్యాత్మిక భావన, దేవుని పట్ల ఆరాధన పెంచుకుంటే చెడు ప్రభావాలు తొలగి భవిష్యత్తులో అనుకున్నది సాధించవచ్చని సూచించారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయ రీతిలో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చైతన్యా మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్, మాజీ సర్పంచులు కవిత గౌడ్, చంద్రగాని నిరోషా జహంగీర్ గౌడ్, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రేపాక స్వామి, టీడీపీ ఆలేరు నియోజకవర్గ ఇంఛార్జ్ రేగు బాలనర్సయ్య, యాదగిరిగుట్ట పట్టణ మాజీ అధ్యక్షుడు భరత్ గౌడ్, మదర్ డెయిరీ డైరెక్టర్ శ్రీశైలం తదితరులు ఉన్నారు.

**సొంత ఖర్చులతో ధ్వజస్తంభం, వినాయక, హనుమాన్, జంట నాగుల విగ్రహాలు**

వంగపల్లి మాజీ సర్పంచ్ చంద్రగాని నిరోషా జహంగీర్ గౌడ్ దాదాపుగా రూ.3.50 లక్షల సొంత ఖర్చులతో..వినాయక విగ్రహం, జీవధ్వజస్తంభం, ఆంజనేయస్వామి విగ్రహం, జంట నాగుల విగ్రహాలను తయారు చేపించి రామాలయానికి అందజేశారు. బుధవారం అట్టి విగ్రహాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలతో ప్రాణప్రతిష్ఠ చేసి ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయానికి, విగ్రహాలకు పలు రూపాల్లో విరాళాలు అందజేసిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

# నేడు యాదగిరిగుట్టకు వరల్డ్ బ్యూటీస్

**నారసింహుడిని దర్శించుకుని ఆలయ అందాలను పరిశీలించనున్న అందాల బామలు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: టూరిజం డెవలప్‌మెంట్, ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా.. ప్రపంచ సుందరీమణులు గురువారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని సందర్శించనున్నారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకున్న అనంతరం.. ఆలయ అందాలను పరిశీలించనున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. యాదగిరికొండకు లేజర్ లైటింగ్, ప్రధానాలయం లోపల ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేసి సప్తగోపుర ప్రధానాలయ సముదాయాన్ని ప్రత్యేకంగా తెప్పించిన పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అదేవిధంగా యాదగిరిగుట్ట పట్టణంలో పలు నిర్మాణాలకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన రహదార్ల వెంట వైకుంఠ ద్వారం నుండి వడాయిగూడెం చౌరస్తా వరకు ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేసి అందంగా సుందరీకరించారు. కాగా అందాల బామల రాక కోసం చేసిన ఏర్పాట్లను బుధవారం అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో తిరిగి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతతో పాటు ఏర్పాట్ల విషయంలో ఎలాంటి పొరపాట్లు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



**ఆలయంలో రెండు గంటలు గడపనున్న సుందరీమణులు**

గురువారం యాదగిరిగుట్ట ఆలయ సందర్శనకు వచ్చే వరల్డ్ బ్యూటీస్ దాదాపుగా రెండు గంటల పాటు గడపనున్నారు. సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు ఆలయంలో స్పెండ్ చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక బస్సులో ప్రపంచ సుందరీమణులు యాదగిరికొండపైకి చేరుకుంటారు. గెస్ట్ హౌస్ లో ఫ్రెషప్ అయిన తర్వాత దేవస్థానానికి చెందిన బ్యాటరీ వాహనాల్లో నేరుగా అఖండజ్యోతి వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి కొబ్బరికాయలు కొట్టనున్నారు. అనంతరం తూర్పు రాజగోపురం మీదుగా త్రితల గోపురం నుండి ఆలయంలోకి ప్రవేశిస్తారు. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రధానాలయ ముఖ మంటపంలో గర్భగుడికి ఎదురుగా ఉన్న స్వర్ణ ధ్వజస్తంభానికి మొక్కి గర్భాలయంలోకి వెళ్తారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకున్న అనంతరం ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు



అష్టోత్తర పూజలు చేస్తారు. అనంతరం పూర్తిగా కృష్ణశిలతో నిర్మితమైన సప్తగోపుర ప్రధానాలయ సముదాయం, అష్టభుజి ప్రాకార మండపాలు, మాడవీధుల్లో ఆలయ ప్రాకారాలపై చెక్కబడిన శిల్పాల అందాలను అందాలబామలు పరిశీలించనున్నారు. అనంతరం ప్రధానాలయ ప్రాంగణంలో ఫొటోషూట్ లో పాల్గొంటారు. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6:30 గంటలకు యాదగిరిగుట్ట నుండి హైదరాబాద్ కు తిరుగు ప్రయాణమవుతారు.




# యాదగిరిగుట్టలో ఘనంగా 'బీర్ల శంకర్' బర్త్ డే వేడుకలు

**ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి కేక్ కట్ చేసిన శంకర్**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోదరుడు, సైదాపురం మాజీ సర్పంచ్ బీర్ల శంకర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. వైకుంఠ ద్వారం వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేక్ ను తన తమ్ముడైన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి కేక్ కట్ చేసి బర్త్ డేను గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకున్నారు. మొదట వడాయిగూడెం చౌరస్తా నుండి యాదగిరిగుట్ట వరకు భారీ ర్యాలీగా వచ్చిన ఆయన.. నేరుగా కొండపైకి వెళ్లి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆశీర్వచన మండపంలో వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఆఫీసర్లు ఆయనకు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు. అనంతరం వైకుంఠ ద్వారం వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్ ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఆయనను గజమాలతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీర్ల శంకర్ మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించానని తెలిపారు. పదవులతో సంబంధం లేకుండా ఆలేరు ప్రజలకు సేవ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్, జిల్లా నాయకుడు దుంబాల వెంకట్ రెడ్డి, మండల నాయకుడు శిఖ ఉపేందర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# యాదగిరిగుట్టలో 'బాంబ్' కాల్ కలకలం

**కల్యాణకట్ట వద్ద బాంబు పెట్టారంటూ 100 కు ఫోన్**

**హుటాహుటిన తనిఖీలు చేపట్టిన పోలీసులు**

**ఫేక్ కాల్ గా నిర్ధారించిన పోలీసులు**

**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలో 'బాంబ్' కాల్ కలకలం రేపింది. యాదగిరి గుట్టలోని కల్యాణకట్ట సమీపంలో బాంబు పెట్టారని ఓ నంబర్ నుండి 100 కు కాల్ చేశారు. దీంతో వెంటనే అలెర్ట్ అయిన పోలీసులు పోలీసులు తనిఖీలు నిర్వహిం చారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్స్ తో విస్తృతంగా సోదాలు చేశారు. కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, అన్నప్రసాద వితరణ కేంద్రం వద్ద అణువణువునా క్షుణ్ణంగా చెక్ చేశారు. సోదాల్లో బాంబుకు సంబంధిం చిన ఎలాంటి ఆధారాలు లభించకపో వడంతో.. ఫేక్ కాల్ గా నిర్ధారించారు. గురువారం యాదగిరిగుట్ట లో మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల పర్యటన ఉన్న నేపథ్యంలో.. ఎవరో కావాలనే 100 నంబర్ కు ఫోన్ చేసి బాంబు ఉందని తప్పుడు సమాచారం ఇచ్చారని ఎస్పీఎఫ్ పోలీసులు తెలిపారు. 100 నంబర్ కు ఫోన్ వచ్చిన సెల్‌ఫోన్ నంబర్ స్విచ్ఛాఫ్ వస్తోందని, ఇది కచ్చితంగా ఆకతాయిల పనేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సెల్ నంబర్ ఆధారంగా ఫోన్ చేసిన వ్యక్తి వివరాల కోసం విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

